

కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో ప్రచారం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం తదితరులు



బోరబండ డివిజన్ భారత్ నగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీఎస్‌ఐసీసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి. మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, ఇన్‌చార్జి మహ్మద్ ముస్తఫా, బస్తీ అధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూమ్, ఎం.డి.ఖలీల్, తదితరులు

బీఆర్ఎస్ అరాచకాలు ప్రజలకు తెలుసు

మంత్రి జూపల్లి కృష్ణారావు

ఎర్రగడ్డ/బోరబండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో చేసిన అరాచకాలన్నీ ప్రజలకు తెలుసని, ఆ పార్టీకి మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ, రాజీవ్‌నగర్ కాలనీ, జయంతి నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా కల్పతరు అపార్ట్‌మెంట్ వాసులను కలిసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం స్పోర్ట్ లాంచ్‌కు వెళ్లి జిమ్‌లో వ్యాయామం చేశారు. అక్కడున్న వారితో షెటిల్ ఆడారు. కార్యక్రమంలో డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్, కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్‌కు మద్దతు

పంజాగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, భారీ మెజారిటీతో గెలిపిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. అట్టడుగు వర్గాల బిడ్డకు, అహంకార పార్టీల మధ్య యుద్ధమే ఉప ఎన్నిక అని, నవీన్ యాదవ్‌పై రౌడీ షీట్ ఉంటే బీఆర్ఎస్ పార్టీ నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నవీన్ యాదవ్‌ను రౌడీగా చిత్రీకరించడం హేయమైన చర్య అన్నారు. తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, సామాజిక మార్పు కోసం పని చేస్తున్న సంస్థ తమదని అన్నారు. సమావేశంలో ఈబీసీ నాయకులు గంటా సత్యనారాయణ, సామాజికవేత్త గొల్లపల్లి దయానంద్, లంబాడీ హక్కుల కోసం పోరాడుతున్న సూర్య నాయక్, బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ అధ్యక్షురాలు బి.పద్మావతి, ముఖ్య కార్యదర్శి పోశాల సరస్వతి, జాతీయ కో-ఆర్డినేటర్ ఉరుమళ్ల విశ్వం, రాష్ట్ర కార్యదర్శి కోడెపాక కుమారస్వామి యాదవ్, వంగ రవి యాదవ్, శ్రీలత, దుర్గేష్, అశోక్, తాళ్ల భాగ్యలక్ష్మి, కొత్తూరి శారద పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం



ప్రచారంలో కరపత్రాలు పంచుతున్న పీజేఆర్ తనయ విజయారెడ్డి



నవీన్ యాదవ్ గెలుపు కోరుతూ ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ జీవీ వెన్నెలగద్దర్, నవీన్ సతీమణి వర్ష

వెన్నెల గద్దర్

యూసుఫ్‌గూడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెంటిమెంట్‌తో గద్దెనెక్కిన బీఆర్ఎస్ పేదల సంక్షేమాన్ని మరిచి కుటుంబ పాలన చేసిందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెలగద్దర్ విమర్శించారు. సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ సతీమణి వర్షతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెన్నెలగద్దర్ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేశాయన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండి ఉప పోరులో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని డివిజన్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఇప్పటికే రూ.150 కోట్ల నిధులను కేటాయించారని, ఆయా డివిజన్లలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల అనంతరం కూడా ఆయా డివిజన్లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లక్ష్మీనరసింహనగర్, యాదగిరినగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో అభ్యర్థి సతీమణి వర్ష ప్రచారం చేశారు.



మైనార్టీ మహిళలతో ప్రచారం చేస్తున్న నవీన్ యాదవ్

పీజేఆర్ తనయ విజయారెడ్డి ప్రచారం

స్వర్గీయ పీజేఆర్ ఆశయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని ఆయన తనయ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖైరతాబాద్‌లో బోరబండ, రహ్మత్ నగర్, ఎస్పీఆర్ హిల్స్ బస్తీల నిర్మాణానికి పీజేఆర్ విశేష కృషి చేశారని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు డివిజన్ నాయకులు విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికి నవీన్ యాదవ్ గెలుపునకు కృషి చేయాలని ఆమె కోరారు.



ప్రచారంలో భాగంగా తారసపడ్డ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రచారంలో మంత్రుల ఆత్మీయ పలకరింపు

ఎర్రగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీల నేతలు ప్రచారంలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలోని నాగార్జున స్కూల్ వద్ద ప్రచారంలో ఆసక్తికర పరిణామం ఎదురైంది. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఎదురుపడ్డారు. నమస్కారం అంటూ నవ్వుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైతం పలకరించుకున్నారు. అనంతరం ఎవరి ప్రచారంలో వారు బిజీ అయిపోయారు.

రైఫిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పి.సందీప్ రైఫిల్ షూటింగ్ అండర్-19లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు సోమవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని, ఇది కళాశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ చదువుతో పాటు విద్యార్థులు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



పి.సందీప్



సీతారామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

స్విమ్మర్ సీతారామయ్య యువతకు ఆదర్శం

హైదర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుడు, స్విమ్మర్ సీతారామయ్య నేటి యువతకు ఆదర్శమని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు గుంటూరులో నిర్వహించిన 8వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించిన సీతారామయ్యను సోమవారం ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శర్మ, గుమ్మడి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రామచందర్ పాల్గొన్నారు.

కార్మికుల పీఎఫ్ వివరాలు వెల్లడించాలి

నిజాంపేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల పీఎఫ్ వివరాలను వెల్లడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌పై పోలీసులకు రగ్బీ సంఘం ఫిర్యాదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): నిజాం కళాశాలలో పనిచేసే ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలంగాణ రగ్బీ సంఘం కార్యదర్శి వి.ఆదిత్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర రగ్బీ సంఘంలో అతడు అడిగిన పదవి ఇవ్వలేదనే అక్కసుతో వివిధ నెంబర్ల నుంచి తనకు ఫోన్ చేసి చంపుతానని బెదిరిస్తున్నాడని మాదాపూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆదిత్య పేర్కొన్నారు. రగ్బీ కార్యకలాపాలు చేయకుండా అడ్డుపడుతున్నాడని, అంతేగాక సోషల్ మీడియాలో కూడా తనపైనా, రగ్బీ సంఘంపైనా అసత్య ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. పూర్ పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

6న ప్రకాశ కిరణాలు ఆవిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న త్యాగరాయగానసభలో పొత్తూరి సుబ్బారావు రచించిన ప్రకాశ కిరణాలు సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వీవీ రాఘవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

ఉప ఎన్నికతోనే కాంగ్రెస్ అరాచక పాలనకు అంతం

వెంగళరావునగర్/బోరబండ/ఎర్రగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోనే కాంగ్రెస్ అరాచక పాలనకు అంతం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా సోమవారం వెంగళరావునగర్ డివిజన్ కృష్ణకాంత్ పార్కు నుంచి మధురానగర్ కాలనీ ఏ-బ్లాక్ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీహెచ్ మల్లారెడ్డి,కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా, స్థానిక కార్పొరేటర్ దేదీప్య పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు మహేష్ యాదవ్, శేఖర్, దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బోరబండ డివిజన్‌కు చెందిన మోసిన్, యూసుఫ్ దాదాపు 200 మందితో కలిసి వారి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బోరబండలోని బస్తీల్లో బీఆర్ఎస్ నేతలు కందుల లక్ష్మయ్య, దొడ్డి రమేష్, కోళ్ల యల్లయ్యగౌడ్, సైదులు తదితరులు ప్రచారం చేశారు. రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌ఫాతిమా నగర్, శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ప్రచారం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర యూసుఫ్‌గూడ డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్ నగర్‌లో ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవ, నాయకులు పల్లవి మహేందర్ యాదవ్, సయ్యద్ రసూల్, మున్నా, అఫ్సర్ పాల్గొన్నారు. అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ ఎర్రగడ్డలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, సంజీవరెడ్డి, వీరారెడ్డి, మల్లికార్జున్ కుమార్, విజయ్‌గౌడ్, సుమ, మౌనిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్ నగర్ కూడలిలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి ప్రచారం చేస్తున్న మాగంటి సునీత

అసెంబ్లీలో ఆవు గొంతు కోసం వినూత్న ప్రచారం



జోడెడ్లతో తయారు చేసిన ప్రచార రథం

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీలో ఆవు గొంతు వినిపించండి' అంటూ యుగ తులసి పార్టీ అధ్యక్షుడు కె.శివకుమార్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో నిలిచారు. ప్రచారంలో భాగంగా జోడెడ్లతో తయారు చేసిన ప్రచార రథంతో వినూత్న ప్రచారం చేపట్టారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాధువులతో ప్రచారం చేశారు. ప్రచార వాహనాలపై 'ఓటే ఇప్పుడు మన ఆయుధం.. గోవు కోసం ప్రాణమొడ్డి కదులుదాం!, జూబ్లీహిల్స్‌లో ఏ పార్టీ గెలిచినా పదవీకాలం మూడేళ్లే..! గోవు గెలిస్తే మాత్రం నిండు నూరేళ్లు..' అంటూ పేర్కొన్నారు. గో బలి ఆగలన్నా.. గోమాత రాష్ట్రమాత కావాలన్నా యుగ తులసి పార్టీని గెలిపించాలని ప్రచార రథాల ద్వారా జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కాళికామాతకు డిప్యూటీ సీఎం సతీమణి పూజలు

చాంద్రాయణగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా కాళికామాతకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని సోమవారం ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం సమర్పించారు. కేశవగిరి చెన్నకేశవస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కె.బబిత ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో చెన్నకేశవస్వామి దేవాలయ మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్, కాళికామాత దేవాలయం ప్రతినిధులు జగన్, బలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కాళికామాతకు పూజలు చేసిన డిప్యూటీ సీఎం సతీమణి నందిని

నాంపల్లి మాతా ఆలయంలో..

అఫ్జల్‌గంజ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని మాతా దేవాలయంలో టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా సోమవారం పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కైలాస్ కేడియా, బల్లుభాయ్, ప్రశాంత్, అశోక్ గుప్తా, కైలాష్ గుప్తా, రాజు భాయి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కట్నం కోసం భార్యపై వేధింపులు

- కానిస్టేబుల్‌పై కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ కుటుంబ సభ్యులతో కలిసి భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానిస్టేబుల్ నరసింహులు, సౌమ్యకు కొంత కాలం క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో సౌమ్య కుటుంబ సభ్యులు రూ.25లక్షల నగదు, అరకిలో బంగారం, 242 గజాల ఇంటి స్థలాన్ని కట్నంగా ఇచ్చారు. అయితే పెళ్లి అనంతరం భార్యాభర్తలు చందానగర్‌లో కాపురం పెట్టారు. కట్నం సరిపోలేదని, అదనపు కట్నం కావాలని నరసింహులు, అతడి కుటుంబ సభ్యులు సౌమ్యను వేధిస్తున్నారు. మరో రూ.10లక్షల నగదు, హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కావాలని ఒత్తిడి చేశారు. ఈ విషయాన్ని బాధితురాలు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. అదనపు కట్నం ఇచ్చే స్థోమత తమకు లేదని వారు తేల్చి చెప్పారు. అప్పటి నుంచి బాధితురాలికి భర్త, అత్తమామల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. వారి వేధింపులు భరించలేని సౌమ్య పుట్టింటికి వచ్చి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ అమృత ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ భారతీయ విద్యాభవన్ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 11కేవీ పద్మాలయ స్టూడియో ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులతో ఆలయ కమిటీ ప్రతినిధులు

వైభవంగా గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు

ఖైరతాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీ నల్లపోచమ్మ, రాజరాజేశ్వర, ముత్యాలమ్మ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో గణపతి, నవగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు జరిగాయి. ప్రముఖ వేద పండితులు రంగరాజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ప్రతిష్ఠాపనలు సోమవారం ముగిశాయి. గచ్చిబౌలికి చెందిన కె.ఆనంద్ ధ్వజస్తంభ దాతగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణ, బొలిగిద్ద కుమార్, లక్ష్మణ్, కె. కిరణ్, రవి, వెంకటేష్, రాజ్‌కుమార్, శివ, శశికాంత్ పాల్గొన్నారు.




బోరబండ సైట్-2 కాలనీ హరిహరపుత్ర అయ్యప్ప దేవస్థానంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి స్వాములకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్

● బోరబండ, ఆంధ్రజ్యోతి

నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడిన నూర్‌బాషా దూదేకుల కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 200 కోట్లు కేటాయించాలని తెలంగాణ ముస్లిం నూర్‌బాషా దూదేకుల బీసీ-బి వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి.అజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రాజష్థ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, కార్యదర్శి బడేసాబ్, గౌరవాధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్ తదితరులు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేట్‌లో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయించిందని, భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. నవీన్‌యాదవ్ విజయానికి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



నిఖిల్ (ఫైల్)

వనస్థలిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పోరేషన్ పరిధిలోని ఇందిరా నెహ్రూనగర్‌లో నివాసముండే నగేష్‌గౌడ్ కుమారుడు సాయి నిఖిల్‌గౌడ్(21) బీటెక్ చదువుకుంటూ వనస్థలిపురంలో చెస్ ఇనిస్టిట్యూట్ నడుపుతున్నాడు. గౌతమ్‌నగర్ డివిజన్‌లో నివాసముండే ఓ యువతిని నిఖిల్‌గౌడ్ ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో సోమవారం వనస్థలిపురంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత తదితరులు నిఖిల్ మృతదేహానికి నివాళులర్పించారు.



దీపాలు వెలిగిస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన, ఉత్తర మండల డీసీపీ రష్మి పెరుమాళ్

ఘనంగా కార్తీకమాస పూజలు

దీపాలు వెలిగించిన కలెక్టర్, డీసీపీ

సికింద్రాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకరు ఐఏఎస్ అధికారిణి, మరొకరు ఐపీఎస్ అధికారిణి. ఇద్దరూ తమ దైనందిన కార్యకలాపాల్లో బిజీగా ఉండే మహిళా ఆఫీసర్లు. ఇద్దరూ సంప్రదాయ వస్త్రధారణలో కార్తీకమాస పూజలు చేసి, భక్తిప్రవృత్తులను చాటు కోవడం అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, దాసరి హరిచందన, ఉత్తర మండల డీసీపీ రష్మి పెరుమాళ్‌లు సోమవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని సందర్శించారు. కార్తీకమాసం సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు జరిపారు. కలెక్టర్ దాసరి హరిచందన, ఉత్తర మండల డీసీపీ రష్మిపెరుమాళ్‌లు ఇటీవల బోనాల జాతర సందర్భంగా కూడా అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారని ఆలయ పూజారులు గుర్తు చేసుకున్నారు. కాగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి స్వీయ పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



మేడిబావిలోని ముత్యాలమ్మ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పలు ఆలయాల్లో కార్తీకమాస శోభ

బౌద్ధనగర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెండో కార్తీక సోమవారం కావటంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కార్తీకదీపాలను వెలిగించారు. సీతాఫల్‌మండి రామాలయం, నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, బౌద్ధనగర్ రామాలయం, కనకదుర్గ ఆలయం, చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో పూజలను నిర్వహించారు.



విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న ఏడీఈ మహేశ్, ఏఈలు

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం : ఏడీఈ

పద్మారావునగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని పద్మారావునగర్ సబ్ డివిజన్ ఏడీఈ మహేశ్ తెలిపారు. గాంధీ ఆసుపత్రి పక్కన గల ప్యారడైజ్ డివిజన్(ఆపరేషన్) సికింద్రాబాద్ విద్యుత్ కార్యాలయంలో సోమవారం కన్స్యూమర్ డే సందర్భంగా విద్యుత్ సమస్య పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మారావునగర్, పార్శీగుట్ట, సీతాఫల్‌మండి, తార్నాక, లాలాగూడ ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఎదురైనా సంబంధిత విద్యుత్ కార్యాలయం లేదా ఫ్యూజ్ ఆఫ్ కాల్(ఎఫ్‌ఓసీ)లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ ఏడీఈ రమణయ్య,ఏఈలు సుబ్రమణ్యారాజు, శ్రీకాంత్‌రెడ్డి, కిష్టయ్య, సబ్ ఇంజనీర్ నరేశ్, ఏఏఓ, సిబ్బంది పాల్గొన్నారు.



బీపీ తనిఖీ పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి అందజేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ స్పందన సంస్థ ప్రతినిధులు

గాంధీ ఆస్పత్రికి బీపీ తనిఖీ పరికరాలు అందజేత

అడ్డగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రికి అవసరమయ్యే వైద్య పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి అందజేశామని ఇన్నర్ వీల్ క్లబ్ స్పందన మాజీ అసిస్టెంట్ డీఎంఈ డాక్టర్ సైఫా అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రికి అవసరమయ్యే బీపీ తనిఖీ పరికరాలను సోమవారం సూపరింటెండెంట్‌కు అందజేశామన్నారు. గతంలో కూడా గాంధీకి వైద్య యంత్రాలు అందజేశామని, అదేవిధంగా నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా వైద్య యంత్రాలను అందజేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు సరస్వతి, కార్యదర్శి షఫియా, రమాదేవి, సరోజ, నర్మద, స్వాతి, వెంకటమ్మలు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం

కార్తీకమాసం రెండో సోమవారం పురస్కరించుకొని లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో భక్తులు శివలింగం ఏర్పాటు చేసి రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

అపస్మారక స్థితిలో మహిళ.. చికిత్స పొందుతూ మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కంటి పరీక్షలు చేయించుకుని రైలులో ప్రయాణం చేస్తున్న ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉండగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బేగంపేట్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన భీమయ్య భార్య మురళ్ల మాధవి (51) కర్ణాటకలోని కోనాపురం గ్రామంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకుని సోమవారం యాదగిరిలో దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి సికింద్రాబాద్‌కు వస్తుండగా.. అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో రైల్వే పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించిన కొద్ది గంటల్లోనే చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వరదనీటితో బస్తీవాసుల అవస్థలు

- ఆర్‌సీసీ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- వానపడితే ఇళ్లు, లాడ్జీల్లోకి చేరుతున్న వరద

రెజిమెంటల్‌బజార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆ బస్తీని వరద నీరు ముంచెత్తుతుంది. వాన మొదలైందంటే ఆ బస్తీ వాసులకు గుండెల్లో ఆందోళన మొదలవుతుంది. నది ప్రవాహంలా వరద నీరు ఇళ్లలోకి చేరి, వస్తువులు వరద నీళ్లలో తేలుతుంటాయి. ఇది మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్ గురుద్వారా పక్క వీధిలో నివాసం ఉంటున్న బస్తీవాసుల అవస్థలు. ఈ వీధిలో నివాస గృహాలతో పాటు లాడ్జీలు కూడా ఉన్నాయి.

లోతట్టు ప్రాంతం కావడంతో..

రెజిమెంటల్‌బజార్ మొత్తానికి ఈ వీధి లోతట్టు ప్రాంతం కావడంతో వరదనీరు త్వరగా వెళ్లే సామర్థ్యం గల కాలువలు లేక ఇళ్లలోకి చేరుతుంది. దీనికి తోడు ఎగువ ప్రాంతంలో నుంచి వచ్చే వాననీరు వరద కాలువల్లోకి వెళ్లే మార్గం లేక రోడ్డు మీద ప్రవహిస్తూ ఇక్కడికి చేరుతుంది.

తడిసిన సామగ్రి, బెడ్‌లు

ఇటీవల కురిసిన కుండపోత వర్షానికి ఇండ్లలోని వాషింగ్ మెషిన్లు, రెఫ్రిజిరేటర్‌లు, నిత్యావసరాలు వరద నీటిలో మునిగిపోయాయి. అలాగే లాడ్జీల్లో రెండు ఫీట్ల ఎత్తులో వరద నీరు చేరింది. కింది ఫ్లోర్‌లో ఉన్న బెడ్లు వరదలో మునిగాయి. వరద నీటితో బయటకు రాలేక సహాయం కోసం ఫోన్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ లాడ్జీలోని సెల్లార్‌లో ఐదు కార్లు నీటిలో మునిగాయి. ఫైరింజన్ సిబ్బంది సహాయంతో సెల్లార్‌లో చేరిన వరద నీటిని బయటకు పంపించారు.

రూ.37 లక్షలతో ఆర్‌సీసీ డ్రైన్

ఈ సమస్య నివారణకు రూ.37 లక్షలతో ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. కొంత భాగం పూర్తికాగా మిగతా భాగం అసంపూర్తిగా మిగిలింది. డ్రైన్ నిర్మాణం పూర్తయితే వరద నీటి సమస్య తీరుతుందని ఆశపడిన బస్తీవాసులకు నిరాశే మిగులుతుంది.



ఆర్‌సీసీ డ్రైన్ పనులు జరుగుతున్న ప్రాంతం

త్వరగా పనులు పూర్తిచేయండి

ఆర్‌సీసీ డ్రైన్ పనులు పూర్తయితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వర్షం పడినపుడు వరద నీరు ఆర్‌సీసీ డ్రైన్‌లోకి వెళ్లడం వల్ల వరదనీరు రోడ్డుపై నిలిచే అవకాశం ఉండదు. త్వరగా పనులు పూర్తిచేయాలి.

- హర్‌ప్రీత్ సింగ్ గులాటీ, గురుద్వారా సెక్రటరీ

వర్షాలు పడటంతో జాప్యం

ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వర్షాలు పడటం వలన పనుల్లో జాప్యం జరుగుతుంది. పది పదిహేను రోజుల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. కాంట్రాక్టర్ త్వరగా పనులు చేసేలా అప్రమత్తం చేస్తున్నాం.

- కొంతం దీపిక, కార్పొరేటర్

బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

- తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బయిలు అడిగితే ప్రభుత్వం కాలేజీలో విజిలెన్స్ దాడులు చేయడం హేయమైన చర్య అని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు అంజి యాదవ్ ఆధ్వర్యంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఇది ప్రయివేటు కళాశాలల సమస్యే కాదని, రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్ సమస్య అన్నారు.

కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నక్క శ్రీశైలం యాదవ్, పూదరి హరీష్ గౌడ్, మినుకూరి శ్రీనివాస్ రెడ్డి, ఆర్.ఎల్ మూర్తి, ఆర్.ఎన్.శంకర్, గద్దల అంజిబాబు, కొమ్ము శేఖర్, వలిగొండ శ్రీనివాస్, బూడిద ప్రవీణ్ మాదిగ, బొల్లు నాగరాజు యాదవ్, వేదాంత మౌర్య, యాదగిరి, రమేష్, వెంకట్ చంద్రకాంత్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ సీతారాం

ముషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సీతారామ్ సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో భాగంగా సోమవారం బోలక్‌పూర్‌లోని అంజుమన్ బాలుర పాఠశాలలో ఫ్రీ డ్రగ్స్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) ఎస్పీ పి. సీతారామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరం గా ఉండడంతో పాటు క్రమశిక్షణతో చదివి రాణించాలన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఏఎన్‌బీ డీఎస్పీ కె. సైదులు, సీఐ శ్రీనివాస్‌రావు, అంజుమన్ తాజీరానే చిరం అధ్యక్షుడు మహ్మద్ అక్తర్‌అలీ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జయరాజ్, ఎస్ఆర్డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సీతారాం

అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలు చెల్లించాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య శాఖలో పనిచేస్తున్న అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలను చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వాణిజ్య పన్నులశాఖ అద్దె వాహనాల డ్రైవర్ల సంఘం నాయకులు రాజు, రాంబాబుల ఆధ్వర్యంలో సోమవారం విద్యానగర్ నుంచి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వరకు డ్రైవర్ల గర్జన నిరసన ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖల్లో గత 9 నెలలుగా అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలు ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల అనేక మంది వాహనదారులు, డ్రైవర్లు వాహనాల ఈఎంఐలను కట్టలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వేతన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, నవీన్, శ్రావణ్, సతీష్, ముజాహిద్, జానయ్య, అశోక్, మురళీ, నర్సింహ, కుమార్, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ల వేతనాలు చెల్లించాలని నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా: కార్పొరేటర్

కాప్రా, నవంబరు 3 (ఆంధ్రజ్యోత): హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని అన్నపూర్ణకాలనీలో సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రభుదాస్ హామీ ఇచ్చారు. అధికారులతో కలిసి సోమవారం ఆయన కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కాప్రా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ సైనిక్‌పురి డివిజనల్ ఇంజనీర్ ఎండీ.అన్వర్ పాషా అన్నారు. హెచ్‌బీ కాలనీ సమీపంలోని సైనిక్‌పురి డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ పరిధిలోని సైనిక్‌పురి, మౌలాలి, కుషాయిగూడ, ఏఎస్ రావునగర్, యాప్రాల్, చర్లపల్లి, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, వసంతపురి, మీర్జాలగూడ, వినాయక్‌నగర్ సెక్షన్‌లకు సంబంధించిన అధికారులు విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్‌రావునగర్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, సైనిక్‌పురి ఏడీఈ రామ్మూర్తి, మల్కాజ్‌గిరి ఏడీఈ చంద్రశేఖర్, చర్లపల్లి ఏడీఈ రామ్‌దాస్, ఆయా సెక్షన్ల ఏఈలు, ఈఆర్‌వోలు పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డివిజనల్ ఇంజనీర్ అన్వర్ పాషా

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



మృతుడు నిఖిల్(ఫైల్)

వనస్థలిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో నివాసముండే నగేష్‌గౌడ్ కుమారుడు సాయి నిఖిల్‌గౌడ్ (21) బీటెక్ చదువుకుంటూ వనస్థలిపురంలో చెస్ ఇన్‌స్టిట్యూట్ నడుపుతున్నాడు. గౌతమ్‌నగర్ డివిజన్‌లో నివాసముండే ఓ యువతిని నిఖిల్‌గౌడ్ ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో సోమవారం వనస్థలిపురంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత తదితరులు ఇందిరా నెహ్రూ నగర్‌కు వెళ్లి నిఖిల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టాస్క్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి

మౌలాలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటీజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు పేర్కొన్నారు. సోమవారం ఉప్పల్ సూర్యనగర్‌లో టాస్క్ సభ్యులు సమావేశమై నూతన జిల్లా కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గ కమిటీ అధ్యక్షుడిగా ఎంపీ రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, సదానందం, శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా జయధీర్, రాజసులోచన, కోశాధికారిగా బుచ్చిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కృష్ణారెడ్డి, దశరథ్, శోభన వరప్రసాద్, జమా, మల్లేష్‌గౌడ్, అచ్యుతరావు, మల్లయ్య, లక్ష్మారెడ్డి, పృథ్వీరెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఎన్నికైయ్యారు. నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు అభినందించారు. ఎలక్షన్ కమిటీ ఆఫీసర్స్‌గా జ్ఞానేశ్వర్‌రావు, సత్యనారాయణ, ముత్యంరెడ్డిలు వ్యవహరించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రధాన పార్టీల డబ్బు, మద్యం పంపిణీని అరికట్టి ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా కోరారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఏ విధంగా కృషి చేస్తామనే అంశాలను ప్రజలకు చెప్పి ఓటు అడగకుండా డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ విష సంస్కృతిని అరికట్టి ప్రజలు నిష్పక్షపాతంగా ఓట్లు వేయాలని కోరారు. ఈ మూడు పార్టీలు గెలవడానికి అడ్డదారులను ఎంచుకున్నాయని ఇది ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు అని అన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుశాఖ గట్టి నిఘా పెట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, వినోద్, శుక్లవేది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

గుట్టరాళ్ల సమస్య పరిష్కరించండి

సికింద్రాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ డివిజన్‌లోని వడ్డెరబస్తీలో భారీ గుట్టరాళ్లు పగుళ్లు ఏర్పడి ఏ క్షణంలోనైనా పడిపోయేలా ఉండడంతో సమస్య పరిష్కరించాలని స్థానికులు కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్‌కు మొర పెట్టుకున్నారు. దాంతో సోమవారం ఆయన అక్కడికి వెళ్లి గుట్టరాళ్లను పరిశీలించారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గుట్టరాళ్లను తొలగించాలని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, వెంకటస్వామి, శంకర్, ముత్యాలు, రాములు తదితరులు పాల్గొన్నారు.



గుట్టరాళ్లను పరిశీలిస్తున్న శ్రీగణేశ్

మహిళను దూషించిన వ్యక్తి అరెస్ట్

బోయినపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో మహిళను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అవినాష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ బోయినపల్లిలోని చిన్నతోకట్టకు చెందిన ప్రియాంక అనే మహిళ ఇంటి గేటు ముందు గత నెల 13న అర్ధరాత్రి కొంతమంది స్థానికులు ఆమె భర్తతో గొడవపడి ఆ మహిళను కూడా దుర్భాషలాడారు. దీంతో ఆ మహిళ ఫిర్యాదు మేరకు జయానగర్‌కు చెందిన సోలమన్‌పై కేసు నమోదు చేశారు. అతడిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14వ ప్రత్యేక ఎంఎం కోర్టు న్యాయమూర్తి 3 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

మరిన్ని అవార్డులు సాధించాలి : సీపీ సుధీర్‌బాబు

ఇన్‌స్పెక్టర్ చంద్రబాబును అభినందించిన సీపీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ గృహ మంత్రి దక్షత పథక్ అవార్డు అందుకున్న యాదాద్రి భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు నగిరిని రాచకొండ సీపీ సుధీర్‌బాబ అభినందించారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ చంద్రబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని అవార్డులు అందుకొని కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అత్యంత సమర్థతతో పనిచేసిన 1466 మంది పోలీసులకు కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ గృహమంత్రి దక్షత పథక్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు దక్కించుకున్న వారిలో యాదాద్రి భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు నగిరి కూడా ఉన్నారు.



అవార్డు సాధించిన యాదాద్రి భువనగిరి రూరల్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న సీపీ జి. సుధీర్‌బాబు



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ నేతలు

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఓయూ ఏసీపీకి బీసీ నేతల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌పై కొంతమంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీ జగన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా బీసీ బిడ్డకు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక అతని వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ ఛైర్మన్ కొమ్మనబోయిన సైదులు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరబోయిన లింగయ్య యాదవ్, భారీ అశోక్, బుర శ్రీనివాస్, మామిడాల రవికుమార్, గోదా రవీందర్, చీరాల వంశీ, నూకల మధు, అభిలాష్ పాల్గొన్నారు.